# గుడ్డిగవ్వ

చెరువ్వొడ్డున ఇసకలో కాళ్లీడ్చుకుంటూ నడుస్తున్నముత్యం కళ్లు తళుక్కుమన్నాయి గజందూరంలో కనిపించినగవ్వని చూడగానే. రెండు నెలవంకలమధ్య జెర్రిపోతులాంటి చారతో ఆ గవ్వ సమాధో సన్‌బేదింగో చేస్తున్నట్టు – అతనికన్ను అట్టే ఆకట్టుకుంది గవ్వ చిన్నదే అయినా. చుట్టూ పరుచుకున్న ఇసకరేణువులు ఎండకి మెరుస్తూ ఓవింతశోభని తెచ్చిపెట్టేయి ఆగవ్వకి.

ముత్యం చూస్తూ నిలబడిపోయేడు కొంతసేపు. అక్కడే వదిలేస్తే మరో పసివాడిమనసుని ఉల్లాసపరుచునేమో అది. ముత్యం ఒంగి, దాన్ని తీసి చేతబుచ్చుకుని కంటికి కాస్త ఎడంగా ఎత్తి పట్టుకు చూశాడు దాన్ని పరీక్షగా. గవ్వమూపున ఆవగింజంత కన్నంలోంచి పుంజీడు ఇసకరేణువులు పొడగట్టేయి అతనికంటికి. అది అలా చేత్తో పుచ్చుకునే మరో పదిఅడుగులు వేశాడు. మరుక్షణం ఆఅబ్బాయికి దానిమీద చిరాకేసింది. ఒంట్లో బలాన్నంతా కూడగట్టుకుని వీలనయినంతదూరం నీటిలోకి విసిరేడు. అతను తమవూళ్లో చెరువులోకి గులకరాళ్లని అలాగే విసిరేవాడు. మామూలుగా ఓమోస్తరు పలకలు దేరినరాయి అయితే నీటిమీద రెండు కప్పగంతులేసి మునిగిపోతుంది. కానీ ఈరోజు ముత్యం విసిరినగుడ్డిగవ్వకి చిల్లుండడంచేత గంతులేమీ లేకుండా బుడుంగుమని మునిగిపోయింది పడ్డచోటే.

ఇంటికొచ్చి లోపలికి పోబోతూంటే, బాబీ కనిపించాడు హాల్లో కూచుని తెల్లబల్లమీద పులీ–మేకా గళ్లు గీసి, తనకోసం ఎదురు చూస్తూ. ముత్యం బాబీకి ఆఆట నేర్పేడు అమెరికాలో అన్నగారింటికి రాగానే. నింటెండోలూ, పోకమానులతో విసుగెత్తిపోయిన బాబీకి చిన్నాన్న నేర్పినకొత్త ఆట ఎంతో నచ్చింది.

ముత్యం చిన్నగా నవ్వి బాబీకి ఎదురుగా కూర్చున్నాడు. పది నిముషాలయిందో లేదో వంటగదిలోంచి వారిజ పిలిచింది, "ముత్యం, పోపులోకి ఓరెండు కరివేపాకు రెమ్మలందుకో," అంటూ.

ముత్యం లేవబోతూంటే, "నో," అంటూ చెయ్యిపుచ్చుకు లాగేడు బాబీ ముద్దుగా.

ఒక్కనిముషం అంటూ ముత్యం సైగ చేసి లేచేడు. కానీ ఇద్దరికీ తెలుసు ముత్యం లేచేడంటే అంతతొరగా మళ్లీ వెనక్కి రావడం జరగదని. బాబీ మొహం ముడుచుకుని, ముందున్నపావులు విసిరేసి, సైకిలుతీసుకు వెళ్లిపోయేడు ఇంటిముందు తొక్కుకోడానికి. లోపల వారిజ కూరలూ, గిన్నెలూ, పప్పూ ఉప్పూ ఒకొకటే కౌంటరుమీద అమర్చుతోంది. మరోగంటలో స్నేహితులు వస్తున్నారు. వచ్చేదువారు గిరికి ఇంటరులో ఇంగ్లీషు చెప్పిన శేఖరం, అతనిఅమ్మా, నాన్నాను.

అతను వాళ్లకి దేశం చూపించడానికి కారులో బయల్దేరేడు వారం రోజులక్రితం. దూరప్రయాణాలకి ప్లేనెక్కినా, అతను వీలయినంతవరకూ కారే ఇష్టపడతాడు, దారిలో అవసరం అయినప్పుడు ఆగొచ్చు అని. అంచేత ఓంప్రథమంగా తల్లిదండ్రులని తీసుకుని దగ్గరవూళ్లు చూపించడానికి బయల్దేరేడు. ఆవరసలో గిరినివాసం నాలుగోది. కొంత తిరగడం అయింది కనక గిరిఇంట్లో కాస్త విశ్రాంతి తీసుకోవచ్చని అతనిప్లాను. పన్నెండయింది.

గిరికి ఆఫీసు అట్టే దూరంకాదు. రోజూ కాకపోయినా, ఇలా అవసరం అయినప్పుడు లంచికి రాగలడు. ఇవాళ స్నేహితులు వస్తున్నారని, ఇంటికొచ్చేడు లంచివేళ. అతను తలుపుదగ్గర వుండగానే శేఖరంకారు కూడా వచ్చి ఇంటిముందు ఆగింది. గిరి నవ్వుతూ వెనుదిరిగి, కారుదగ్గరికి వచ్చేడు.

శేఖరం కారాపి, అమ్మా, నాన్నా దిగడానికి తలుపు తీసి, వాళ్లు దిగింతరవాత సూట్‌కేసులు ట్రంకులోంచి తీశాడు. గిరి పెద్దలకి నమస్కారాలు చెప్పి, కుశలప్రశ్నలేసి, శేఖరంతో, "ఉండనీండి. నేను తెస్తాను ఆపెట్టెలు," అంటూ అడ్డుపడి, వాళ్లని గుమ్మంవేపు నడిపించేడు. గిరికి శేఖరం అంటే అంతులేని గౌరవం. సామాన్యకుటుంబంలో పుట్టినగిరికి ట్యూషనులు పెట్టుకునే స్తోమతులేదని తెలిసి, శేఖరం సాయంచేశాడు ఉచితంగా కొన్నాళ్లపాటు. ఆసాయం గిరి జన్మలో మరువడు. అంచేత ఆయన పెట్టెలు మోస్తుంటే చూస్తూ వూరుకోలేడు.

శేఖరం మొహమాటపడుతూనే, పెట్టెలు వదిలేసి శిష్యుడిని అనుసరించేడు. ఆవెనక సోమయ్యగారూ, కోటమ్మగారూ అడుగులో అడుగేసుకుంటూ నడిచేరు. తలుపుదగ్గర వారిజా, ముత్యం నిలబడి స్వాగతం పలికేరు. గిరి కళ్లతోనే ముత్యానికి సౌంజ్ఞ చేసేడు పెట్టెలవిషయం.

ముత్యం చూచాయగా తల తాటించి. మూడుపెట్టెలూ ట్రంకులోంచి తీసి, ఒకొకటే రెండోఅంతస్థులో వున్న అతిథులగదికి చేర్చి, మళ్లీ వచ్చి వంటింట్లోకెళ్లి ట్రేలో కాఫీల్తో ముందుగదిలోకి వచ్చేడు.

గిరి తమ్ముడివేపు చూసి, "కూచో, నువ్వు కూడా కాఫీ తెచ్చుకో," అన్నాడు కానీ ముత్యం కూచోలేదు. వంటలో పనుందని సైగచేసి, వెళ్లిపోయాడు. కోటమ్మ సాయంచేయనా అంటూ అతన్ని అనుసరించింది కానీ అక్కడ ఆవిడకి

చేసేదేం కనిపించలేదు. వంకాయలు తరుగుతున్న వారిజ చిన్నగా నవ్వి, "ఎలా వుంది దేశం?" అంది పలకరింపుగా. "బాగుందండి," అందావిడ. తరవాత ఏంమాటాడాలో ఇద్దరికీ తోచలేదు.

ముత్యం కరివేపాకురెబ్బలు గుప్పెడు పుచ్చుకుని లోపలికొచ్చేడు. వారిజ ఆరెబ్బలందుకుని, తాను తరుగుతున్న వంకాయా, కత్తీ అతనికి వదిలేసింది. ముత్యం మౌనంగా కత్తీ, కాయా తీసుకున్నాడు.

కోటమ్మ వారిద్దరినీ చూస్తూ ఏదో మాటవరసకో గతం తలబోసుకుంటూనో మాటలు మొదలెట్టింది, "ఏవిటో కాలం. తలుచుకుంటే నాలుగుతరాలు గడిచిపోయినట్టుంది. నిన్నా మొన్నా ఇంటినిండా గలగల్లాడుతూ పదిమంది ఆడవాళ్లం వుండేవాళ్లం. ఒకరికొకరు పనులు పురమాయించుకోడంలేదు. ఎప్పుడు చూసినా చేతినిండా పనే. ఏరోజు చూసినా ఇల్లు సత్తరవులా వుండేది, వచ్చే, పోయేజనాలతో. మాతాత అసలు సహపంక్తిన రెండోవిస్తరి లేకుండా భోజనానికి కూర్చునేవారు కాదుట."

వారిజ నవ్వుతూ, పనిచేసుకుంటూ వింటోంది. మామూలుగా ఇండియానించి చుట్టపుచూపుగా వచ్చినవాళ్లకి రెండే విషయాలుంటాయి మాటాడ్డానికి. అయితే ఇక్కడున్న సౌఖ్యాలూ లేకపోతే అక్కడ అడుగంటిపోతున్న సాంప్రదాయాలూను.

ముత్యం కూర తరగడం పూర్తిచేసి, ముక్కలు మరోసారి నీళ్లతో కడిగి, వారిజకిచ్చి, సింకులో గిన్నెలు కడగడం మొదలుపెట్టేడు. అతను వచ్చి ఏడాదయింది. ఈఏడాదిలోనూ ఇలాటికథలు కొన్నివందలసార్లు విన్నాడు. నలుగురు చేరినప్పుడల్లా ఇవే కబుర్లు.

ముందుగదిలో శేఖరంతండ్రి సోమయ్య అటూ ఇటూ చూసి లేవబోతుంటే గిరి గమనించి, "ఏం కావాలండీ?" అనడిగేడు.

"అ, ఏంలేదు. కొంచెం మంచినీళ్లు. నేం తెచ్చుకుంటాలే," అన్నారు సోమయ్యగారు.

"అయ్యో. మీరు కూర్చోండి. నే తెస్తా," అని "ముత్యం, కాస్త మంచినీళ్లు తెచ్చియ్యి అంకుల్‌కి" అని లోపలికి కేకేశాడు.

ముత్యం మంచినీళ్లు తెచ్చి సోమయ్యకిచ్చి, మళ్లీ లోపలికి వెళ్లిపోయాడు. గిన్నెలు కడగడం పూర్తి చేసి, వచ్చి బాబీపక్కన కూర్చున్నాడు. బాబీ టీవీముందు కూర్చుని లెక్కలు చేసుకుంటున్నాడు. మధ్య మధ్యలో తనకి తెలీనివి ముత్యాన్ని అడుగుతున్నాడు.

"చదువులో కూడా సాయం చేస్తున్నాడే. మంచిఅబ్బాయినే సంపాయించారు. ఈరోజుల్లో మనూర్ల అస్సలు ఒళ్లొంచి పనిచేసే పాలేర్లే కనిపిచ్చట్లేదు," అన్నారు కోటమ్మగారు.

వారిజ ఉలిక్కిపడి, "అయ్యో పాలేరు కాదండీ. మామరిది. రెండేళ్లక్రితం జబ్బుపడి మాట పడిపోయింది. గొంతు  ఆపరేషను చేయించాలంటే తీసుకొచ్చేం.."

"ఆహా, అలాగా. మంచిపని చేస్తున్నారు. ఎప్పుడు ఆపరేషను?"

వారిజకి కాస్త ఇబ్బంది అయిండి ఆప్రశ్న. "ఏదండీ, ఇంకా ప్రయత్నాల్లోనే వున్నాం. అతను ఇక్కడ దిగింతరవాత, డాక్టర్లపరీక్షలతోనే ఆర్నెల్లయిపోయింది. ఇంతలో మాచెల్లెలిపెళ్లి. మగపెళ్లివారు మహా నాజాగ్గా కట్నం అక్కర్లేదు, ఖర్చులకి యాభైవేలు ఇమ్మంటున్నారుట. కాస్త డబ్బు సర్దండంటూ ఉత్తరాలమీద ఉత్తరాలు గుప్పించేరు మానాన్న. మాదగ్గర లేదంటే నిష్ఠూరం. అదయేసరికి ఇక్కడ ఇంటి రిపేర్లు. చెరువుపక్కన ఇల్లు ప్రశాంతంగా వుంటుందని కొన్నాం. గట్టిగా నాలుగు వానలు పడేనరికి నీళ్లు ఇంట్లోకొచ్చేశాయి. పునాదులు కూరుకుపోతున్నాయి. వచ్చేవేసవిలోనేనా అవుతుందేమో చూడాలి," అంది వారిజ.

ముత్యం తలొంచుకుని బాబీకి లెక్కలు చెప్తున్నాడు వదినగారిమాటలు విననట్టు నటిస్తూ.

అటువేపునించి గిరిమాటలు వినిపిస్తున్నాయి, "ఏమిటో మాస్టారూ, ఇక్కడ ఇన్నికబుర్లు చెబుతారు కానీ నిజంగా మనిషికి కాదు వీళ్లు విలువిచ్చేది. టైమీజ్ మనీ అంటారు కానీ వాళ్లటైముకే విలువంతాను. మనం ఎంత చేసినా ఇంకా చేయించుకోవాలనే చూస్తారు. సాయంత్రం అయింతరవాత ఏ ఆఫీసు చూడండి, మీకు ఒక్క తెల్లతోలు కనిపించదు. మీరు విన్నారో లేదో కానీ మనం రెండింతలు పని చేస్తే తమవారికిచ్చేదాన్లో సగం మనచేతిలో పెడతారు. అది కూడా మననేదో ఉద్ధరిస్తున్నట్టు."

"విలువలు వేరూ, బజారుధరలు వేరూ," అన్నారు సోమయ్యగారు నవ్వుతూ. అవును మరి. అవతలిమనిషి చూసేది ఎదటివాడిసామర్థ్యం కాదు. తమధనం మాత్రమే ఘనంగా కనిపిస్తుంది కానీ తాము ఎదటివాడిశ్రమకి విలువ కడుతున్నాననుకోడు."

వారిజ వచ్చింది లంచికి రమ్మంటూ.

ముత్యం బల్లమీద కంచాలూ, గ్లాసులూ పెట్టేడు. ఎనిమిదిమందికి సరిపోయేబల్ల. అందరూ కూర్చున్నారు. బాబీపక్కన ముత్యం కూర్చున్నాడు.

గిరి మళ్లీ మొదలుపెట్టేడు. "అందరూ మేంవిక్కడ బోలెడు డాలర్లు సంపాదిస్తున్నాం అనుకుంటారు కానీ ఎంత కష్టపడితే వస్తాయవి అని ఆలోచించరు. మనవాళ్లన్నట్టు డాలర్లేం చెట్టున కాయవు కదా. అసలు చదువు పూర్తయేసరికే ఆస్తులు హరించుకుపోయేయి. ఎలాగో అయిందనిపించేం కానీ ఉద్యోగంలో చేరేక తెలిసింది నిజంగా కాయకష్టానికున్న విలువ. రోజుకి ముప్ఫైగంటలు గిలగిల కొట్టుకున్నా, ఎప్పుడు ఏకాతాదారు ఏ పెంటపెడతాడోనన్న బెరుకే. ఏకంపెనీ ఎప్పుడు

మూతపడుతుందో, ఎవడికి ఎప్పుడేం ముంచుకొస్తుందోనన్న బెంగే. ఇవాళున్న ఉజ్జోగం రేపుంటుందన్న భరోసా లేదు. ఇంత కష్టపడి సంపాదించిన సంపాదనమీద ఇంటిల్లిపాదీ ఆశలు పెట్టుకునుంటారు. ఆమధ్య నాస్నేహితుడొకడు – మాఆఫీసులోనే వుంటాడు – దాదాపు

కళ్లనీళ్లపర్యంతం అయేడు. తమ్ముళ్లచదువులూ, చెల్లెళ్లకి చదువుల్తోపాటు పెళ్లిళ్లూ – వీటితో ఆరిపోతున్నానని. పైగా వాళ్లమేనమామ ఎప్పుడో అతనితల్లిపెళ్లికి పదివేలు అప్పు చేశానని ఇప్పటికీ దెప్పుతూనేవుంటాడుట. ఆపదివేలూ ఎన్నిమార్లు తీర్చేనో చెప్పలేను, ఆయనో నేనో హరీమనేవరకూ తీరదాఅప్పు అంటాడు," అంటూ గట్టిగా నవ్వేడు గిరి. ఎంచేతోగానీ, పొరుగువాడిబాధంత చక్కటిసబ్జెక్టు మరొకటి వుండదు కాలక్షేపానికీ, నవ్వుకోడానికీ కూడా.

"టైము చూసుకో" అంది వారిజ హెచ్చరికగా.

గిరి గతుక్కుమని వాచీ చూసుకుని, గుక్కెడు మంచినీళ్లు తాగి, "సాయంత్రం మాటాడుకుందాం, మీరు రెస్టు తీసుకోండి" అంటూ లేచి, ఆఫీసుకి పరుగెట్టేడు. సాయంత్రం గిరి రావడం కొంచెం ఆలస్యం అయింది. మిత్రులంతా హాల్లో కూర్చుని విడియో చూస్తున్నారు. "హాయ్" అన్నాడు బాబీ తండ్రిని చూడగానే. వారిజా, శేఖరమూ గిరిమొహం చూసి గతుక్కుమన్నారు. అతనిమొహం పాలిపోయి వుంది. ఆర్నెల్లనుండీ తిండిలేనట్టున్నాడు చూస్తుంటే.

"ఏంవైంది. ఒంట్లో బాగులేదా?" అంది వారిజ లేచి దగ్గరికి వస్తూ.

గిరి ఏమీ లేదన్నట్టు సైగచేసి పక్కగదిలోకి తప్పుకున్నాడు హడావుడిగా. ఆవిడ అతన్ననుసరించింది. ఓపావుగంటతరవాత ఇద్దరూ ముందుగదిలోకి వచ్చేరు. విషయం చెప్పేడు, వీలయినంత సాధారణంగా ధ్వనించడానికి ప్రయత్నిస్తూ. అతడివుద్యోగం ఆనాటితో సరి!

అయ్యో అంటూ సానుభూతి వెలిబుచ్చారు శేఖరమూ, సోమయ్యగారూను. గిరి నెమ్మదిగా వివరాలు చెప్పేడు.

మేనేజిమెంటు కొంగ్రొత్తపద్ధతులలో కంపెనీ పునరుద్ధరించాలను కుంటున్నారు కొంతకాలంగా. గిరిస్థానంలో అప్పుడే యేల్‌నించి దిగివచ్చిన యువకుడిని వేసుకున్నారు. గిరిని పొమ్మనలేదు కానీ అతనికి చూపిన మరోస్థానం మాత్రం అతనిసామర్థ్యానికి తగినది కాదు.

"కాదు, కాదు. ఇందులో కూడా నీకు పైకిరాగల అవకాశాలు చాలా వున్నాయి," అన్నాడు కొత్తమేనేజరు.

"మాకు వెంటనే చెప్పక్కర్లేదు. వారంరోజులుంది నీకు ఆలోచించుకోడానికి," అని భరోసా ఇచ్చేరు ఎంతో కన్సర్న్‌తో. గిరి ఉడికిపోతూ ఇల్లు చేరుకున్నాడు.

"నాకు నవ్వొస్తోంది మాస్టారూ! నిన్నే కదూ మనం అనుకున్నాం ఈమాట. అదేదో శకునం చెప్పినట్టు. మీరు చెప్పండి, మాష్టారూ, ఒకమనిషిసామర్థ్యానికి విలువ

ఎలా కడతారు ఎవరైనా?" అన్నాడు గిరి. ఆగొంతులో నిన్నటి ఔద్ధత్యం, హాస్యం, ఉత్సాహం మచ్చుకైనా కనిపించడంలేదు ఇవాళ.

శేఖరం కొంచెం టైము తీసుకున్నాడు జవాబు చెప్పడానికి. తరవాత నెమ్మదిగా, "ఎవరికొలమానాలు వారివి, గిరీ. నీకున్న సామర్థ్యానికీ, వాళ్లకి కావలసినదానికీ పొందిక లేకపోవచ్చు. వాళ్లు చూసేదల్లా ఎంత తక్కువఖర్చుతో వాళ్లపని అయిపోతుందనే కదా. నీదృష్టిలో నీడాలరుకున్నవిలువే వారిదృష్టిలో వారిడాలరుకుంది. ఆరెండుకోణాల్లో తేడా నీకు తెలిసే వుంటుంది," అన్నాడు.

లేదు. గిరికి ఆ రెండుకోణాల్లో తేడా కనిపించడంలేదు. అది అతని దృష్టిలోపం అనడానిక్కూడా లేదు. క్లాసుల్లోనూ, పుస్తకాల్లోనూ విశ్లేషించేతేడా కాదది. మాష్టారు చూడకుండా పళ్లు కొరుక్కున్నాడతను. శేఖరం పరిస్థితులు గమనించి, తెల్లారుతూనే ప్రయాణం కట్టేడు.

"అదేంటి రెండురోజులుంటాం అన్నారు కదా. ఉండండి. ఫరవాలేదు. ఆమాత్రం పెట్టలేకపోం," అన్నారు గిరీ, వారిజా నిజంగానే నొచ్చుకుంటూ.

"ఎంతమాట! మీరు పెట్టలేరని కాదు, గిరీ! వెదరు బాగుంది. అమ్మా, నాన్నా మీయింట్లో ఒకరోజుతో కోలుకున్నాం, ప్రాణం తెరిపినబడింది అంటున్నారు. వాళ్లకి కాస్త ఓపిక వుండగానే హూస్టన్ కూడా చూపించేయొచ్చని. ఇప్పుడు బయల్దేరితే మధ్యాన్నానికల్లా అక్కడికి చేరుకుంటాం. మళ్లీ ఎప్పుడేనా నేను వస్తాలే," అని శేఖరం సర్ది చెప్పేడు.

"బ్రేక్‌ఫాస్టయినా తిని బయల్దేరండి," అంది వారిజ.

"నాకేం పాలుపోడంలేదు మాష్టారూ. మీసలహా ఏమిటి, చెప్పండి," అన్నాడు గిరి సోమయ్యగారితో. ఆయన తనకి డైరెక్టుగా మాష్టారు కాకపోయినా, పెద్దవారు కనక తత్తుల్యులే.

సోమయ్య నిదానంగా మాటాడుతూ, తనఅభిప్రాయం వివరించేరు, "గిరీ, ఆరెండోఉద్యోగంలో చేర్తావో లేదో నాకు తెలీదు. కానీ నాకు అర్థం కానిది చెప్తాను. ఇక్కడికొచ్చాక లేదా ఈకాలంలోనే అనుకో. ఎంతసేపూ తానెంతవరకూ రాబట్టుకోగలనన్న యావే కనిపిస్తోంది ప్రతివారిలోనూ. ఈతగ్గింపుధరలూ, ఉచితంగా వచ్చేవస్తువులూ చూడు. కారు కొంటే సైకిలు ఉచితం. నువ్వు సైకిలు కావాలని కారు కొనవు. కారు కొంటే దాంతో వచ్చే సైకిలుధర కారుధరలో ఇమిడివుంటుందని నీబుద్ధికి తెలుసు. అయినాసరే. కారుతోపాటు సైకిలు తెచ్చుకుని మహదానందం పొందుతావు. అలా ఉచితంగా వచ్చినవాటితో మావాడింట్లో ఓగది నిండిపోయింది. పూర్వం మాతాత ఒకకొబ్బరికాయ కొంటే, మరో కొబ్బరికాయ కొసరడిగేవాడుట. ఆమాట చెప్పి మాఅమ్మ నవ్వుతూండేది. నిన్న అందుకే అన్నాను వస్తువువిలువ వేరూ, బజారుధర వేరూను అని. ఉదాహరణకి, నువ్వు నీ రెస్యూమేలో నీకు కర్నాటకసంగీతం వచ్చుననీ, అంచేత నీకాతాదార్లలో కర్ణపేయంగా మాటాడి

ఒప్పించగలననీ రాస్తావనుకో. అది మీమేనేజరుకి నచ్చితే సరే. లేకపోతే, నాక్కావలిసింది నీ బిజినెస్ఎకుమెన్ కానీ సంగీతజ్ఞానం కాదని కొట్టిపారేస్తాడు. అంటే నీవిద్యలో తనకి పనికొచ్చేవి మాత్రమే తీసుకుని నీకు విలువ కడతాడు అన్నమాట. అదే సంగీతం ఇష్టమయినమరొకడికి నీమాట సవ్యంగానే తోచవచ్చు. నువ్వు నీచదువుకీ, సామర్థ్యానికీ, నీకు తోచినవిలువలకి నువ్వు ధర కట్టుకున్నావు. ఇంతకీ నీప్రశ్న - అందరికీ తెలిసినదే అయినా క్రియదగ్గరకొచ్చేసరికి ఎవరూ దాన్ని గమనంలోకి తీసుకోరు. ఏంచేతనంటావు?"

గిరికి ఆయన ప్రశ్న సవ్యంగా తోచలేదు. ఒక ఎంప్లాయిగా తనవిలువ ఎంప్లాయరులందరికీ ఒకేరకంగా కనిపించదంటున్నారాయన? అదెలా సాధ్యం? ముత్యం సామాను తెచ్చి కార్లో పెట్టేడు. సోమయ్యగారికేం తోచిందో గానీ ముత్యందగ్గరకొచ్చి, అతనిబుజంమీద ఆప్యాయంగా తట్టి, అతడిచెయ్యి తనచేతిలోకి తీసుకుని, ఆచేతిలో ఓ నోటు పెట్టేరు. ముత్యం చెయ్యి వెనక్కి లాక్కోబోయాడు కానీ ఆయన పట్టుబట్టి తనచేత్తో అతనిగుప్పిడి మూసి, వెళ్లి కార్లో కూర్చున్నారు. కారు కదిలేక, గిరీ, వారిజా లోపలికి నడిచేరు.

ముత్యం మాత్రం స్థబ్దుడయి నిలుచుండిపోయేడు కారు కనుమరుగయే వరకూ. మనసు నలికిలపాములా మెలికలు తిరిగింది. అంతరాంతరాల మరుగుతున్నమథనని తరిచి చూడ్డానికి ఎవరూ ఇష్టపడరు. ఆ పెద్దాయనకి తెలిసినట్టే వుంది కానీ ఆయన ఆవిషయం గిరితో ప్రస్తావించలేదు. బహుశా లాభంలేదనుకున్నారేమో. శేఖరంతో కూడా మాటాడి వుండకపోవచ్చు. అతనితో మాటాడీ లాభంలేదు కనక.

బాబీ వచ్చి ముత్యంపక్కన నిలబడి, అతనిచేతిలో ఏమిటదని అడుగు తున్నాడు. ముత్యానికి అమ్మమాటలు జ్ఞాపకం వచ్చేయి. ఆవిడ మనిషితత్వాలగురించి అంటూ వుండేది, "గుప్పిడి మూసినంతసేపే గారడీ" అని.

ఆకౌతుకం వున్నంతసేపే జనాలు వుంటారు. అది తెలుసుకన్నతరవాత ఏమీ లేదు. ప్చ్ అని చప్పరించి ఎవరిదారిన వారు పోతారు.

"చూపించు," అంటున్నాడు బాబీ చొక్కా వుచ్చుకు లాగుతూ.

ముత్యం అపిల్లాడివేపు ఓక్షణం చూసి, తన ముష్టివేపు చూసుకున్నాడు. ఇప్పుడు ఇక్కడ తను వున్న పరిస్థితుల్లో తనవిలువెంత? ఈకాయితపుముక్క విలువెంత? ముత్యంవేళ్లు సడలి సుతారంగా కలువరేకుల్లా విచ్చుకున్నాయి. ఓ పిల్లగాలొచ్చి అతడిచేతిలోని ద్రవ్యం నొల్లుకుపోయింది.

అబ్! నిన్నటి గుడ్డిగవ్వే నయం. కాస్త వూపు కావాల్సొచ్చింది విసరడానికి. ఆ గుడ్డిగవ్వపాటి చేయలేదు ఈ పచ్చకాయితం!

(తెలుగువెలుగు, షికాగో, 2004, ప్రత్యేకసంచికలో తొలిముద్రణ.)

❋ ❋ ❋